"అతన్ని కేమవుతాడు?" అనడిగాడు చుట్టూ చూసి.

"మా నాయనే" అన్నాడా కుర్రాడు.

"నాకు నేర్చుకోవాలనుంది. ఎంతో బావుంటుంది. నాకు పిల్లంగోరు నేర్పమంటే నేర్పుతాడా?" అనడిగాడు ఆశాపూరితంగా చూస్తూ.


"నాకు వచ్చు. నేన్నేర్పగల్ను." కంఠంలో ధీమా ధ్వనించింది.

"అబ్బా! నీకూ వచ్చా! నాకే రాదుగాని."

ఆశ్చర్యమూ అపనమ్మకమూ పెనగొన్నయ్.

ఆ కుర్రా డదోలా చూశాడు.

మానేపల్లి సత్యనారాయణ



*విధి బలీయమైనది. కోరిక కూడా అంతే. కోరిక అంటూ పుట్టనేరాదు కాని పుట్టితేమాత్రం పిల్లలకు సర్వమూ తానే అయి కూర్చుంటుంది. నెరవేర్చుకొనడానికి పిల్లలు ఏమైనా చేస్తారు. ఎంతకు అయినా తెగిస్తారు. ఇంతకూ అది ఎంతటి చిన్న కోరిక!*

"సరే గాని....పోనీ మీ నాన్నను నేర్పమనగూడదూ....అసలు నేర్పమంటే నేర్పుతాడాని.... ఇంతకు ముందెవరికేనా నేర్పేడా?"

"ఎవరూ నేర్పమని అడగలా ఇంతవరకూ."

భయం వేసిందతనికి. ఓవేళ నేర్పడేమో...?!?

చూపులు చుట్టూ తిప్పాడు నిస్సహాయంగా.

"ఆ పిల్లెవరూ....?" అన్నాడు గుడారం దగ్గర జుట్టె గడిసుకుంటూ కూచున్న చిన్న పిల్లను చూపించి.

"మా చెల్లెలే...."

"ఏం పేరు?"

"రాణి."

నవ్వొచ్చిం దతనికి. అలాటి పేరు తను ఇంతకుముందెప్పు వినలేదు.

"రాణి ఏంటి....కాణీకిమల్లే!" అన్నాడు. నవ్వాపు జేసుకుంటూ "నీ పేరేంటో చెప్పు...?" అన్నాడు చెల్లెలిపేరు విని నవ్వుతుంటే ఓపలేక, అసూయతో.

అది ఇంతవరకూ తనను ఎవరూ అడగని ప్రశ్న!! ఏం జెప్పడం? తన పేరు....! అవును.... అసలు—తనకు పేరుందా? ఏదోటి చెప్పాలి. తన్నందరూ "ఒరే" అని పిలుస్తారు. అంతేగాని తనకు పేరు లేందే!

"చెప్పవే! ఏంటి నీ పేరు?" అని మళ్ళా అడిగాడా కుర్రాడు.

అందరూ 'ఒరే' అని పిలుస్తే సీతన్నగారి పాలేరు పొదన్నమాత్రం తనను అప్పుడప్పుడూ 'పిల్లోడా' అని పిలుస్తాడు....

"పిల్లోడు....అవును. నా పేరదే.... పిల్లోడు."

ఆ కుర్రాడు ఒక్కపెట్టున నవ్వాడు. గుడారం గుమ్మం దగ్గర కూచున్న "రాణి" బెదిరింది.

"పిల్లోడేంటి? పిల్లంగోరులాగ" అన్నాడా కుర్రాడు నవ్వాపు చేసుకుని.

బిక్కమొహం వేశాడు, రాణికేసి చూస్తూ. ఇక వీణ్ణడిగితే లాభంలేదని తెలిసిపోయింది. "ఎన్నాళ్ళుంటా రీ ఊళ్ళో" అనడిగాడు, "పోనీ అదేనా సరిగా చెప్పు" అన్నట్టు చూస్తూ.

"మేమా....అబ్బో! వారం రోజులు పైగా ఉంటాం....ఏదీ నిస్సిగా వొస్తె...."

నుడిగాలికి లేచే కెరటాలకు మల్లే అతనిలో ఆనందం నురుసులు గక్కుతూ పొంగింది.... అక్కణ్ణుంచి కదిలాడు.

రేపు తప్పకుండా అతన్నడిగెయ్యాలి, తనకు పిల్లంగోరు నేర్పమని. అబ్బ....!....పిల్లంగోరు

## "వాయులీనం"

ఊత్తుంటే ఎంత బావుంటుంది. అలా ఊదుదామంటే తనకు రాదు. ఎలాగయినా నేర్చేసుగోవాలి. కాలవొడ్డున చెట్టుక్రింద కూచుని ఎంచక్కా ఊదుకోవచ్చు; లేదా తుమ్మచెట్టు కిందయినా కూచుని ఊదుకోవచ్చు. వీలయితే నేస్తాలక్కూడా నేర్పితే నేర్పచ్చు. అందరూ కలిసి పిల్లంగోరు ఊదుకుంటూ, మందల్ని తోలుకుని పొలానికి పోవచ్చు....ఊహో సౌధాలు ఆకాశాన్నంటాయ్.

ఆవుల్ని తోలుకెళ్ళే వేళ కావస్తున్నది. ఖామందు కూకలేస్తాడేమో—? పరుగు పరుగున ఖామందు ఇల్లు చేరుకున్నాడు. గాది పక్క మంచి సాల చేరుకుని వెల్లావు దగ్గర కెళ్ళి పలుపు తియ్యడం ప్రారంభించాడు గబగబా.... ఇంతలో యజమానురాలు (ఖామందు భార్య) ఎక్కణ్ణుంచో ప్రత్యక్షమయింది.

"ఎక్కడ చచ్చేవురా యింతసేపూనూ.... ముదనష్టపోడా."

"ఎక్కడికీ యెళ్ళలా! యీ గాదికాడే వున్నా." ఆవిడకేసి చూడకుండా సమాధానం చెప్పాడు.



స్వామి పూజకు

చిత్రం—వీరిశెట్టి అచ్యుతరావు (పుల్లేటికుర్రు)

"చల్దికూడు తినడానికి రాలేదేమరి?" అవి గర్జించింది.

"ఆకలికాలా! ఇప్పు డొస్తున్నా."


ఎర్రగా చూసి గిర్రున లోపలి కెళ్ళిపోయింది.

పిల్లోడు గబగబా వెళ్ళి చల్దన్నం తినేసొచ్చాడు. ఆవుల్ని తోలుకుంటూ బయల్దేరాడు. దారిలో ఓ ఆలోచన తట్టింది. తనే అందాకా ఓ పిల్లంగోరు చేసుకుంటే....! ఓ సన్న పాటి వెదురుకర్ర విరిచి కొడవలితో సాపు చేశాడు. ఆ తరవాత ఏం చేయాలో తోచలేదు. ఆలోచించగా ఆలోచించగా కన్నాలున్నాయనే సంగతి జ్ఞాపకం వచ్చింది. కన్నాలు కొట్టబోతే కర్ర బద్దలైపోయింది. ఎంతకీ చేతగాలేదు. మనసు విలవిల్లాడింది. నేస్తాల్ని పలకరించలేదు. సాయంత్రందాకా ఎలాగో గడిపేశాడు. చీకట్లు కమ్ముతూండగా మందల్ని తోలుకొచ్చాడు. తను రోజూ మామూలుగా చెయ్యాల్సిన మిగతాపన్లు పూర్తిచేశాడు. ఖామందమ్మ పోసిన అంబలి తాగి గాదికింద పడుకున్నాడు.

మోళీ అసామీ దగ్గర తను పిల్లంగోరు నేర్చుకున్నట్టు కలొచ్చింది. తను ఎంచక్కా ఊత్తున్నాడు. తనస్తమానూ 'పిల్లంగోరు', 'పిల్లంగోరు' అంటుంటే అతగాడు పిల్లంగోరుకాదు "వాయులీనం" అని అన్నాడు. తనకు అనడం రాలేదు. ఆయులీనం అన్నాడు. రాణి అన్న మళ్ళానవ్వాడు. కష్టపడి చివరికి వాయులీనం అన్నాడు. మరోసారి మరోసారి వాయులీనం అనుకున్నాడు, సరదా తీరక. మెలకు వొచ్చింది.

దూరంగా ఉన్న వేపచెట్టుమీద గోరింకలు కూస్తున్నాయి. చీకట్లు విచ్చుకుని వెలుగు రేకలు వ్యాపిస్తున్నాయ్. ఆ వెలుగులోంచి చల్లని, మెల్లని గాలి వీచి ఒంటికి హాయి గొలుపుతున్నది. ఒక్కసారిగా లేచి నిలుచుని ఒళ్ళు విరుచుకుని బద్ధకం తీర్చుకున్నాడు. కల లీలగా జ్ఞాపకం వచ్చింది. వాయులీనం అందామనుకున్నాడు. గాని రాలేదు. తను పిల్లంగోరు ఊదుతూండడం కళ్ళల్లో మెదిలి ఉబ్బిపోయాడు. ఏనాటికయినా తనకు పిల్లంగోరు ఊదడం వస్తుందనే గట్టి నమ్మక మొకటి అతనిలో వేళ్ళు తన్నింది—— మానవుడు ఆశాజీవి!

గొడ్లకు గడ్డివేశాడు. వాకిట్లో కళ్ళాపు జల్లాడు. కొట్టం శుభ్రంగా ఊడ్చాడు. అప్పటికి బాగా తెల్లవార వస్తూంది. కడవ పట్టుకుని కాలవకు బయలుదేరాడు, నీళ్ళు తెచ్చేందుకు.... ఖామందుగారింటికీ, కాలవకూ అట్టే దూరం లేదు. కాలవగట్టునే అతను నీళ్ళు ముంచే రేవుకు కొంచెం దూరంలో మోళీవాడి గుడారం ఉంది. వెళ్ళి కలుసుకుందామనుకున్నాడు. అక్కడి కెళ్ళి ఏమని అడగాలో అర్థంకాలేదు....ఇంతెందుకు? ఇంకా బాగా పొద్దెక్కితే అతను మోళీగడతాడు. అప్పుడు జనం పోగవుతారు. పిల్లంగోరు ఊదుతూ తమాషాలు చేస్తాడు. అప్పుడు కలుసుకుంటేనే




మంచిదిలా కనిపించింది. కాని తనకు పనుం టుందిగా అప్పుడు?....ఖామందమ్మ రానీయ దాయె. ఎలాగ....?....పోనీ మందను తోలు కెళ్ళేముందు ఇలా గొకసారొస్తే సరి, ఏసంగతీ అడగచ్చు.

ఆఖరి కడవ ముంచుకుని, నెత్తికెత్తుకుని ఇంటిదారి పట్టాడు.

ముంతలు పట్టుకుని పాలు పితకడానికి బయ ల్దేరాడు. అతను పాలు పితకడం ప్రారంభించి ఓ నెల పైబడుతుంది. అంతకుముందు ఖామందమ్మ పితికేది. కాస్త కాస్త పెద్ద వాడవుతున్నాడు కనుక ఆ పని కూడా తనకే అంటగట్టింది. మొదటి రోజుల్లో భయంగా ఉండేది గాని ఇప్పు డలవాటయి పోయింది. ఒకరోజున ఆ మచ్చలావు తను పాలు పితుకు తుంటే తన్నింది కూడాను....అప్పుడు పాలన్నీ ఒలిగిపోతే ఖామందమ్మ కూడా తన్నింది.

పాలు పితికిన ముంతలు మూడూ పట్టుకుని లోపలి కెళ్ళాడు.

అతనికి తన తల్లెవరో తండ్రెవరో తెలీదు. కాని ఖామందూ ఖామందమ్మా మాత్రం తలి దండ్రులు కాదని బాగా తెలుసు. వాళ్ళను అయ్యా! అమ్మా! అనే పిలుస్తాడు. తల్లెవరు అనిగాని, తండ్రెవరు అని గాని వాళ్ళను అడగ లేదు. అసలా ఆలోచన అతన్లో ప్రవేశించలేదు. ఊహ తెలిసిన దగ్గర్నుంచీ అతని దినచర్య ఇప్పటిలాగే ఉంది. తన కిప్పుడు పన్నెండేళ్ళని, ఇక రెండు మూడేళ్ళుపోతే పొలానికి కూడా పంపవచ్చునని ఖామందమ్మ, ఖామందుతో అన్న మాటలు విన్నా డొకసారి.

మిగతా పనులు కూడా పూర్తి చేసుకుని, చద్దికూడు తిని, బయలు దేరాడు మందవెంట. ఊరవతలదాకా కూడా వెళ్ళి మళ్ళా వెనక్కొచ్చాడు, కాలవ గట్టమ్మటే. దూరంగా మర్రిచెట్టు కింద గుడారం కనిపించింది. మర్రిచెట్టు ఊడలు కాలవలో వేలాడుతున్నయ్. మోళీ అయిపోయింది గావోసు అతగాడు గుడారం బయట్నే నిల బడున్నాడు. మీసాలు మెలేసుకుంటూ ఎటో చూస్తున్నాడు. అందరూ లోపలున్నారు. పొడుగు పాటే చుట్టకూడా నోట్లో ఉంది.

బెరుకు బెరుగ్గా దగ్గరి కెళ్ళాడు.

రెండు ఎండు టాకులు కింద ధారినయ్....

"ఇదిగో....అయ్యా...." అన్నాడు అతని కేసి చూస్తూ. కళ్ళు ఓ విధమయిన ఆశతో వెలుగుతున్నాయ్.

ఇటుకేసి తిరిగి కళ్ళదించి చూశాడు, ఏమన్నట్టు—

"నేను....మరేం....నేను పిల్లంగోరు నేర్చు కుంటా! హాఁ...అవునఁ" వాలిక నములుకున్నాడు నెళ్ళావుకు మళ్ళే—

అయితే ఏం జెయ్యమంటా వన్నట్టు చూశాడు ఎర్రటి కళ్ళతో...తుపుక్కున ఉమ్మితూ. లోపల్నుంచి రాణి అన్నగావోసు పిల్లంగోరు ఊత్తున్నాడు, సన్నంగా...

"అదే....ఆయుతీనం....నాకు నేర్పాలి! నేర్చు కుంటా....!" అన్నాడు మళ్ళా. విరిగిన పళ్ళు కనిపించేలా చిన్న నవ్వు నవ్వాడతగాడు. కొంచెం ధైర్యం వచ్చింది.

"అవును....అది....చేలా బాగుంటది."

తనుగూడా కొంచెం నవ్వుతూ అన్నాడు. నిశ్శబ్దం. అతను ఏమీ మాటాడలేదు. పక్కనున్న కాలవ చప్పుడు చెయ్యడంలేదు.

మర్రిచెట్టు ఊడలు కదులుతున్నాయి. కాల వలో చిన్న చిన్న అలలు పుట్టి పెద్దవై చెదిరి పోతున్నాయి. ఆఖరిసారిగా పీల్చి, చుట్ట దూరంగా పారేసి తుపుక్కున ఉమ్మి మీసం ఒకసారి దువ్వుకుని లోపలి కెళ్ళిపోయాడా ఆసామీ....

స్తబ్దుగా నిలుచుండిపోయాడు కుర్రాడు. రాణి ఏడుపు వినిపించింది గుడారంలోంచి.

ఆ పిల్ల అన్నగారి పిల్లంగోరు ఆగిపోయింది.

కొంచెం దూరంలో కట్టిఉన్న కుక్క అతణ్ణొక్కణ్ణే చూసి, కాస్త "గుయ్ గుయ్" లాడింది, మొరుగుదామా, మానాదామా అని ఆలోచిస్తూ—

ఏం చెయ్యాలో తోచలేదు.

నోరు తెరుచుకుని ఉన్నదన్న సంగతి గ్రహించి, పెదాలు మూసుకుని మెడమీద గోక్కున్నాడు, అలవాటుగా—

బహుశా రేపువస్తే మంచిదేమో....

అప్రయత్నంగానే వెనక్కు తిరిగి మళ్ళా పొలందారి పట్టాడు. మనస్సు వికలమయిపోయింది. కొంపమునిగి తన కది రాదేమో....?

శివాలయంలో గంటలు వినిపించినాయి.

"అబ్బో, వేళ మించిపోయిందే?" అను కున్నాడు. అడుగులు గబగబా వేస్తూ నడక సాగించాడు. కొద్దిసేపట్లో మందను చేరుకున్నాడు. ఇంతలో సీతన్నగారి మాదన్న; మచ్చలావును తోలుతూ వచ్చాడు.

"పిల్లోడా! యిక్కడికి బోయా? పూజ వయ్యా మీ మచ్చలావు చెరువ పేలో వడింది. ముఖ్యంగా మూడుగజాల మేర బాటవం తోకి పింది...చెప్తానుండు—మీ ఖామందుతో."

"అబ్బే. యిక్కడేగా వుంట. యిటొచ్చిం

దబ్బా" అన్నా జేమీ ఎరగనట్టు—భయ పడుతూ.

"ఆఁ! ఆఁ! చాల్చాల్లే! నువ్విప్పుడేగా వొస్తా... నేను యెళ్ళేదనుకున్నావా...యివాళిదయింది రేపు మళ్ళీటవ్వద్దు...మీ యజమాన్తో చెప్తేగాని.." అంటూనేమాట పూర్తి చెయ్యకుండా వెళ్లి పోయాడు...చెప్పొద్దని బ్రతిమాలడానిక్కూడా అవకాశం చిక్కలా. మనసులో వణుకు పట్టు కుంది. ఖామందుతో చెప్తే మరేం ఫరవాలేదు; రెండు కేకలేసి ఊరుకుంటాడు. అంతేగాని కొట్టడు. అమ్మగారితో చెప్పాడా ఒళ్లు చిట్లం తన్నమాటే. అయినా...ఈ దరిద్రపుగొట్టు మచ్చలావు ఎప్పుడూ అంతే...తనను తన్నిం చడం తప్ప దానికిక పనిలేదుగామోను—

తుమ్మచెట్లల్లోంచి గాలి ఈలలు వేసు కుంటూ వస్తున్నది. మందను ఇటుకేసి మళ్లించి ఓ చెట్టు కింద కూచున్నాడు. సూర్యు డికి భయపడి చెట్టునీడ చెట్టుకిందకే చేరు కుంది. ఎండ నిప్పులు గ్రక్కుతూంది. మిగతా పోస్తాలు పక్కచెట్ల కింద గోలీకాయ లాడు కుంటున్నారు.

పిల్లంగోరు గురించిన ఆలోచన్లు మళ్లా తొలిచేయ్.

చన్! పిల్లంగోరు అనగూడదింక....వాయు లీనం అంటూండాలి...అదివింటూంటే తన కెందు కింత ఆనందం పెల్లుబుకుతుంది? అది నేర్చు కోవాలనుకోవడం తన తప్పుమాత్రం గాదు. దాన్నెవరు అంత చేటు బాగోమన్నారు? అది బావుంటుంది కనుక తనకు నేర్చుకోవాలని పించింది. తను గనక పిల్లంగోరు ఊత్తుంటే.... అదే, వాయులీనం ఊత్తుంటే చుట్టూ పిల్ల లందరూ తన దగ్గరజేరి బుర్రలూపుతారు. తన కేసి గౌరవంగా చూస్తారు. హాఁ తన్నదియ్యి!

# వాయులీనం

అప్పుడెంత బావుంటుందో....బలే....

నీడ చెట్టునొదిలి దూరంగా పారిపోయింది. ఎండ చుఱుక్కుమంది ఒంటిమీద పడి. ఆవులు దూరం దూరంగా మేస్తున్నాయ్. కొందరు కుర్రాళ్ళు చిన్న చెరువులో దిగి గేదెల్ని కడుగు తున్నారు. నీడపడే చోటికి పోయి కూచున్నాడు కాసేపు....

గాలిని ముక్కుతో పొడిచేసి ముందుకు సాగి పోతున్నాయ్—కొంగలు. తమను కూడా పొడి చేస్తాయేమోనని భయపడి వాటి కాళ్లకింద నుంచి జారి తప్పుకుంటున్నాయ్—మేఘాలు. యజమానురాలిచేత దెబ్బలు తిన్నట్టు సూరీడి మొహం ఎర్రబడింది.

ఎదురుగా ఉన్న తుమ్మచెట్టు మీదకు పిట్ట లన్నీ చేరుకోగానే, అతను ఇంటికి బయలు దేరాడు—మందల్ని తోలుకుని. ఒకటి.... రెండు....మూడు.... పదకొండు! లెక్క పెట్టుకుని మామూలుగా వాటివెంట నడు స్తున్నాడు.

నడుంమీద చెయ్యేసుకుని, అరుగుమీద నిలబడి ఆకాశంలోంచి కిందకు చూసినట్టు చూస్తూంది రోడ్డుమీదికి—ఖామందమ్మ. కన బడకుండా ఉండాలని వెల్లావు వెనకాలే తారట్లా డుతూ దొడ్లోకి దారితీశాడు.

"వారేయ్....మాటేలారా!"

తన అరుపుకు తనే అదిరిపోయినట్టు కని పించింది....దవడలు కదిలినయ్....బిక్కమొహం వేసి జాలిగా చూశాడు.

"విన్నే....రా యిటు."

వెళ్లాడు మెడమీద గోక్కుంటూ, అల వాటుగా.

"ఎటు జచ్చేవ్ ప్రొద్దున్న"— మెట్లు దిగుతూ గర్జించింది.

దూరంనుంచి ఎవరో పిల్లంగోరు ఊదుతూ వస్తున్నారు. అటుకేసి చూశాడు, "యెక్కడికీ యెళ్లలా" అని అబద్దం ఆడుతూనే. దూరంగా రాణి అన్న కనిపించాడు—పిల్లంగోరు ఊదు కుంటూ యిటే వస్తున్నాడు. మందలో ఆఖర్ని ఉన్న మచ్చలావు ఒకసారి తనకేసి చూసి, వెళ్లి పోయింది.

"ఎట్రా జూస్తన్నావ్! వచ్చినోడా! ఆ మాదన్న చెప్పలేదనుకున్నావా?" దవడ పేళ్ళ మంది.

"అళ్ల పెసర చేనులోకి వదిలేశావటగా మచ్చ లావుని. మంచోడు గనక సరిపోయింది గాని బందిలిదొడ్లో కట్టేస్తేనో! ఎక్కడేడిశావంట! మాటాడవేఁ!" మళ్ళా నాలుగు తగిలాయి.

ఖామందు ఇంట్లోంచి వచ్చాడు, చుట్ట కొస కొరుకుతూ—అగ్గి పెట్టెతో చుట్ట వెలిగించుకుని, "ఎందుకే కొడతావ్? మువ్వెళ్ళ లోపలికి....నేజూస్తా" — "ఏంరా బుద్ధిలే" అన్నాడు అడ్డంవస్తూ.

పిల్లోడు బిక్క చచ్చిపోయాడు. ఏడవటం లేదు.

"మువ్వడ్డ మొచ్చావ్‌గాని....పళ్ళు రాలిపోను యెదవ కియ్యాల" అంటూ వెనక్కు తగ్గి, లోపలి కెళ్లిపోయింది.

"ఎక్కడికి పోయావ్రా" అన్నాడు యజ మాని అరుగుమీద కూచుంటూ.

ఇంతలో రాణి అన్న ఆ దారిన వచ్చాడు. పిల్లోడికేసి చూసి నవ్వాడు....నీళ్ళు దిరిగిన కళ్లల్లోంచి స్నేహపూర్వకంగా తనూ నవ్వాడు.

"వాయులీనం నేర్చుకుందామని" అన్నాడు వాడిన గొంతుతో—అతి కష్టంమీద. చోద్యం చూస్తున్నట్టు రాణి అన్న ఆగిపోయాడక్కడ....

"ఏటేఁ?" అన్నాడు యజమాని తుపుక్కున ఉమ్మి. తను వాడిన మాట అంత పెద్ద పెద్ద మీసాలున్న యజమానిక్కూడా అర్థంకానందుకు.. గొప్ప ఇదయిపోయాడు.

"అదే పిల్లంగోరు....నేర్చుకోవడానికి", రాణి అన్న నవ్వేడు.

"ఎక్కడికీ?" రెట్టించాడు యజమాని.


"మోళీవోడి కాడికి" రాణి అన్నకేసి చూస్తూ అన్నాడు.

"నేరిపేడా?" "లేదు." కాసేపు నిశ్శబ్దం.

రాణి అన్న పిల్లంగోరు ఊదుకుంటూ కదిలా డక్కణ్ణుంచి. కదిలేముందు అడిగాడు: "మా అయ్య కిరాణా కొట్టుకాడ బియ్యం దెమ్మన్నాడు. కొట్టెక్కడ?"

"ఈ యీధి చివరికెళ్ళు" అన్నాడు సమా ధానంగా. వెళ్లిపోయాడు.

పిల్లంగోరు పాటతో పాటు మనసు గూడా



చిత్రం—మోహన్‌రామ్ (చిత్తూరు)

బయల్దేరింది దావివెంట.

"పరిలే! జాగ్రత్తగా మసులు! పోయి పమ్మాసుకో యదవేషా లెయ్యక" అన్న యజమాని కంచుగొంతు విని మనసు వెనక్కొచ్చింది.

"యెంతో బావుంటుంది అది వూత్తుంటే" అన్నాడు పొంగిపోతూ, "నేర్చుకో పోసి" అంటాడేమో అనుకుంటూ.

యజమాని మాటాడలేదు. మనసు చల్లారిపోయింది.

కాస్సేపక్కడే నిలబడి దొడ్లోకి దారితీశాడు. ఆవులకు కుడితి పెడుతూంటే ఆలోచనలు రేగుతున్నాయ్.

....బియ్యం కొనుక్కుని రాణి అన్న మళ్లా ఇలాగే వస్తాడు. అప్పుడడిగితే చేతిలో పిల్లంగోరిచ్చెయ్యమని? కావలిస్తే రేపు పుచ్చకాయలూ, దోసకాయలూ పట్టుకెళ్లివ్వచ్చు. యజమానమ్మ కాస్త కన్ను అటుబెడితే వాలుగ్గైదు దోసిళ్ల వడ్లు కూడా ఇవ్వొచ్చు.... వాయులీనం వినిపించింది. వస్తున్నట్టున్నాడు. పాల్లోంచి బయటికొచ్చాడు.

"ఉష్! యిదుగో....! యిట్రా మాట...." పిలిచాడు. బెదురుగా కొంచెం దగ్గరికొచ్చి "ఏఁ?" అన్నాడు రాణి అన్న.

"గట్టిగా మాటాడకు. నీకు రేపు బోల్డు దోసకాయలూ, పుచ్చకాయలూ పొలంనించి తెచ్చి పెడతా. యీలంయితే వడ్లూ యిస్తా....అది.... నీ చేతిలోది....ఆ పిల్లంగోరియ్యావ్....నేర్చుకుంటా. ఊఁ!"

"అమ్మో! మా బాబు నా యీపు పగలెయ్యడూ?"


నిస్పహాయంగా, జాలిగా చూశాడు. రాణి అన్న చెప్పాడు నెమ్మదిగా....చెవిలో ఏదో.... పిల్లాడి కళ్లు ఆనందంగా మెరిశాయి.

"యేఁ గేవకంవుందా రేపు రేతిరి తప్పకుండా చేసుంచుతా."

రాణి అన్న గబగబా వెళ్ళిపోయాడు.

ఆనందంతో కొంపముంచి గుండె బ్రద్దలైపోతుందేమోననిపించింది. వెర్రిగా పాల్లోనే గంతులేశాడు. తను వాయులీనంలో ప్రవీణుడైనట్టే సంతోషపడిపోయాడు. పనులు జోరుగా పూర్తిచేశాడు. పన్నెండేళ్లనుంచీ మొదటిసారిగా కూనిరాగం తీశాడు. అంతకూ ఆనందం పట్టలేక ఉదయిస్తున్న చంద్రుణ్ణి చూసి కన్నుగిలికేడు. వెల్లావు నుదురు ముద్దు పెట్టుకున్నాడు. వరద లొచ్చిన నదికి మళ్లే ఆనందం పెల్లుబుకుతూంది. వాళ్లంతా ఆదోరకంమత్తుతో ఐరు వెక్కిపోతూంది. వెధవది....ఎంత దబ్బున కాలం గడుస్తుందా అని ఉంది. పడుకుంటే నిద్రే పట్టలేదు. హాఁ! తనకు....పిల్లంగోరు వచ్చేసినట్టే....ఛవ్....వాయులీనం....అబ్బా....

ఇలాటి ఆనందం ఇంతకుముందెరగడు. ఆనందం ఇలా ఉంటుందని ఇంతకుముందు తెలియదు. ఆ తెలియని ఆనందం వాయులీనంతో ప్రారంభించడం విచిత్రం....పిల్లాడు అంతచేటు ఆనందం అనుభవిస్తూంటే చూస్తూ ఊరుకోలేక ఉక్రోషం వచ్చి వెన్నెలంతా ప్రపంచం మీదకు ఊసేస్తున్నాడు చంద్రుడు. ఏలాగో తెల్లవారింది. కాలం గడవనంటూంది....నెమ్మది నెమ్మదిగా సూర్యుడు పడమర చేరుకున్నాడు.



ఇదేనా ప్రపంచం!

(మైసూరు జంతు ప్రదర్శనశాలలో హిప్పో)

ఫోటో—సి. వి. సీతారామస్వామి (మద్రాసు-18)

పెద్దపెద్దవి దోసకాయలూ, చాలా మంచివని తోచిన రెండు పుచ్చకాయలూ కోసుకున్నాడు. ఇవి ఇంటికి పట్టికెళితే ప్రమాదం! ఖామందమ్మ చూసిందంటే చంపుతుంది....రాత్రికి మళ్లా చంద్రుడు రానే వస్తాడు. రాణి అన్న దగ్గరికెళ్లే ముందు ఇలావచ్చి, అడ్డదారిన అటు పట్టుకెళ్తే మంచిది. వడ్లు సంపాయిద్దామంటే కుదరనే లేదు—

ఇంకా చేసేడో లేదో పిల్లంగోరు? చేసే ఉంటాడు. బాగా చేతొచ్చి ఉంటుంది. తనకు నేర్పుతానన్నాడు కూడాను. ఎంత మంచోడో? చాలా మంచోడు....లేకపోతే తనకు నేర్పుతాడా? కోసినవన్నీ గుర్తుగా ఒక చిన్నపొదలో దాచి ఇంటిదారి పట్టాడు.

....గాలి రివ్వున కొడుతూంది. వాయుదేవుడు కూడా హుషారుగా ఉన్నాడు. ఏం పరదా పుట్టిందో ఏమో....? కొబ్బరి చెట్లు ఊగి పోతున్నాయ్. దుమ్ము రేగుతూంది. రేగలు తోకలు పైకెత్తి చెంగు చెంగున గంతులేస్తున్నాయ్. ఆవులు "అంబా" అంటూ ముందుకు సాగుతున్నాయ్....

పనులన్నీ పూర్తి చేసుకున్నాడు.

సంతోషంతో శరీరం వణకడం ప్రారంభించింది.


ప్రకృతి కూడా వణుకుతూంది, గాలికి తట్టుకోలేక. యజమానికి కొట్టంమీద కప్పు ఎగిరిపోతుందేమోనని భయంగా ఉంది. వాలుగు పక్కలా తడవల్తో గట్టిగా కట్టొచ్చాడు పిల్లోడు. మామూలుగా అంబలి తాగాడు, మిరపకాయ కొరుక్కుని. అసలు ఆకలే అనిపించలేదు.... కడుపు నిన్ననగా నిండిపోయిందాయె....!

దొంగతనంగా చూడ్డానికి కళ్లు విప్పుతున్నట్టు, ఆకాశం కళ్లు విప్పి మెరుస్తూ ప్రపంచంకేసి చూస్తూంది. వాయులీనం ఊదుతున్నట్టు గాలి ఊళలువేస్తూ, శూన్యంలో పల్టీలు కొడుతున్నది. ఈ గొడవంతా ఎందుకని చంద్రుడు మబ్బుల వెనక విశ్రాంతి తీసుకుంటున్నాడు.

— — ఈ వెధ వార్పాటం అంతా ఇప్పుడే రావాలా? వెధవది వడ్లు దొరికేయికాదు....! ఇప్పుడేం చేస్తూంటాడో....ఇంకా రాలేదెంచేతా అని తనకోసం ఎదురు చూస్తూంటాడేమో....

నెమ్మదిగా గాది కిందనుంచి లేచి ఇంటి తలుపుకేసి ఒకసారి చూసి ముందు అడుగు వేశాడు. అందరూ తలుపులు బిడాయించుకుని ఇళ్లల్లో దూరారు. పెంటలమీద విస్తళ్ళు పక్షుల్లా ఎగురుతున్నాయ్.. ఊరు దాటి పొలం గట్టు చేరేసరికి తుంపర్లు ప్రారంభించేయ్.... ఈ పాడు గాలివాన మూలాన్ని కొంపముంచి ఈ రాత్రి కుదరదేమో....భయంవేసి పట్టుదల హెచ్చింది. దోసకాయలు దాచిన పొదను జ్ఞాపకం చేసుకుంటూ, నెత్తిమీద గుడ్డ వేసుకుని ముందుకు సాగాడు. మధ్యలో మధ్యలో మెరు

(తరువాయి 41 వ పేజీలో)



దివ్య సన్నిధి    ఫోటో— జె. ఎమ్. పరీఖ్ (బొంబాయి-4)

పుల్నిబట్టీ దారి తెలుస్తూంది. మొత్తంమీద పొలం చేరుకునేసరికి చినుకులు ఎక్కువయ్యాయి. చీకట్లో తను దోసకాయలు దాచిన పొద కని పించలేదు. తొందరపడినకొద్దీ ఆలస్యమౌతూంది.

గబగబా మళ్ళా కాయలు కోశాడు. రెండు పుచ్చకాయలు కూడా తెంపుకుని బయల్దేరాడు. జుట్టు తడిసి చూరునీళ్ళలాగ మొహంమీదకు కారుతున్నాయ్, వాన నీళ్ళు....

....మంచి కాయలు కోశాడు. వీటిని చూడ్డం తోనే ఒకటి కాకపోతే రెండు పిల్లంగోర్లు పట్టు కెళ్లమంటాడు. ఒకటి చాల్లే అంటాడు తను. పిల్లంగోరు నేర్పేట్టయితే ఇలా రోజూ ఇస్తా వని చెప్తేసరి....ఒక నిమిషంలో నేర్పేస్తాడు.... అది పట్టుకుని ఇంటికొచ్చి ఊత్తే ఖామందు ఆశ్చర్యపోతాడు. ఖామందమ్మ కూడా మూడిం తులు ఆశ్చర్యం పడుతుంది.

చెట్ల కొమ్మల్లోంచి గాలి దాగుడు మూళ లాడుతూంది. వె(ర్రి సంతోషంతో అడుగులు తేలిపోతున్నాయ్.

పుంతదాటి కాలవగట్టు పట్టాడు.

తనక్కూ మోళీవోడి గుడారానికీదూరం తగ్గు తున్నకొద్దీ ఆనందంతో [illegible]తున్నాడు.

తప్పదియ్యా....వర్షం మరీ ఎక్కువై పోతూంది—తనకోసం ఎదురు చూస్తూంది

## వాయులీనం

(25వ పేజీ తరువాయి)

ఉంటాడు....అందరూ ఈపాటికి ముసుగు బిగించి ఉంటారు....అవును....అంతే....

రోడ్లమీంచి నీరు కాలవలోకి పోతూంది. చెట్లన్నీ వర్షానికి వణికిపోతున్నాయ్.

పెద్ద మెరుపు మెరిసింది. వెంటనే ఉరిమింది.

అదిగో గుడారం....ఇంకెంతో దూరంలేదు.. దగ్గర కొచ్చేసినట్టే....అల్లదిగో.....అదికాదూ... తెల్లగానూ. అయితే చాలా తొందరగానే వచ్చేశా డన్నమాట....పిల్లంగోరు పుచ్చుకుని వెంటనే వెళ్ళిపోవాలి....ఖామందుకు గానితెలిస్తే కూక లేస్తాడు....ఏమీ ఎరగనట్టు తెల్లారి లేచి పనులన్నీ చేసుకుపోవాలి. ఊదడం వచ్చిందాకా పిల్లంగోరు ఎవరికీ చూపెట్టగూడదు....పెణ కలో దాచిపేసరి....యెవరికీ కనిపించదు....

పంద గజాల్లో కొచ్చాడు.

ఇంకో నిమిషంలో అక్కడుండడూ....

గబగబా పరుగెత్తుతున్నాడు. వర్షం చిందు తూంది. ఇంతసేపట్నుంచీ గుడారంలో మిణుకు మిణుకుమని వెలుగుతున్న దీపం గాలికి ఆరి పోయింది....

వాయుదేవుడు ఆవలించాడు.

వాయులీనం కేక లేసింది.

మ(రిచెట్టు ఊగిపోతూంది.

దోసకాయలు గట్టిగా పట్టుకున్నాడు. మరి నాలు గడుగు లున్నాయి.

ఢణేల్‌మంది ఉరుము....


వాయుదేవుడి నరాలు తెగాయి.

కొబ్బరి చెట్టు ఊగి ఊగి ఫెళఫెళమంది.

"వాయులీనం, వాయులీనం" అనుకున్నాడు పిల్లోడు నోట్లో— నోట్లో మాటలు నోట్లో ఉండగానే అతనిమీద కొబ్బరి మానంది. చేతులో ఉన్న దోసకాయలు జారిపోలేదు....పట్టు తప్పిం చుని పుచ్చకాయలు పారిపోలేదు...... (ప్రాణం మూలగలేదు....హృదయం ఏడవలేదు. కొబ్బరి చెట్టు అడుగున దాక్కున్నాడు. పెదాలు వాయు లీనం అనడం మానలేదు....మనసు పిల్లంగోరు గురించి ఆలోచిస్తూంది.

గాలి ఇంకా ఊళలు వేస్తూ పళ్ళీలు కొడుతూంది. కాలవ నీట్లో మరగలు కట్టాయ్.... మ(రిచెట్టు ఊడలు ఊగుతున్నాయ్.

వీను పొచ్చిందాకా కురిసి కురిసి వర్షం ఇక కురవడం మానేసింది. పళ్ళీలు కొట్టి కొట్టి



తిరుచినాపల్లి పట్టణ దృశ్యం     ఫోటో—టి. గంగాధరశాస్త్రి (రాజమండ్రి)

గాలి దేవుడికి కాలు జెణికినట్టుంది. ఆకాశం మెరవడం మానేసింది....

సూర్యుడు ఉదయించడం మానలేదు....

గాలి వానకు ఎగిరిపోతుందనుకున్న గుడారం ఎగిరిపోలేదు. అదంతా తన మంత్ర శక్తను కున్నాడు మోళీ అసామీ....రాణీ అన్న గుడారం తడిక ఒత్తిగించుకుని నోట్లో మర్రి ఊడ పెట్టుకుని బయటికొచ్చాడు....

పిల్లంగోరు తయారు చెయ్యడానికి తెచ్చిన వెదురు కర్రతో రాణి ఆడుకుంటూంది...

బూరా చేసుకోవడానికి కొబ్బరి ఆకులు దగ్గరగా అందుబాటులో ఉన్నాయ్....చెట్టు ఆకుల్లో దోసకాయలు కనిపించాయ్. ఆకు పైకిలాగి కాయ తీసుకోబోయాడు. ఆ కాయను పట్టుకుని ఒక చెయ్యి కనిపించింది. ముందుకు వంగి చూశాడు...

ఎవరో మనిషి....

భయమేసింది రాణీ అన్నకు...ఒక్క ఉరుకున అయ్య దగ్గరకెళ్లి వాలాడు....“యేట్రా ఆ పరుగూ” అన్నాడతను చిరాగ్గా....ఆ కేక విని రాణి ఉలిక్కిపడింది....

“మనిషి .... అవును .... నిజంగానే .... ఎవరో మనిషి చెట్టుకింద పడుకున్నాడు....” ఎందుకో తెలియని తడబాటు—

# వాయులీనం

“యెవడ్రా! యేటి నువ్వనేది! యెక్కడంట.”

ముందు పరుగెత్తాడు....గుడారం బయటి కొచ్చి పడిపోయిన కొబ్బరి చెట్టు చూశాక కొడుకు మాటల్లో నమ్మకం కలిగింది....కూడా వెళ్లాడు....

“ఇదిగో...యే...కనిపించిందా?” కొబ్బరాకులు ఒత్తిగించి చెయ్యి చూపించాడు....నిజమే!

బలమంతా ఉపయోగించి ఒక్క నెట్టు నెట్టాడు మ్రానును.

రాణి అన్న ఆశ్చర్యపోయాడు....పిల్లోడు... నోట్లోంచి రక్తం! పిల్లంగోరుకోసం రాత్రి అతన్ని రమ్మన్న సంగతి జ్ఞాపకం వచ్చింది. రాత్రి వెన్నెలుంటుంది గనుక గుడిసె దగ్గర కొచ్చి ఈలవేస్తే బయటికొస్తానని చెప్పాడు తను....ఒక పిల్లంగోరు చేసిపెడితే దోసకాయలూ పుచ్చకాయలూ ఇస్తానని ఒప్పుకున్నాడు.... ఈ సంగతి తండ్రికి చెప్దామా, మాన్దామా అనుకుంటూనే మానేశాడు....

మోళీ అతను అలాగా చూస్తూ ఉండి పోయాడు....నలుగు రైదుగురు పోయేవాళ్లు పోగయ్యారు....చూస్తూండగానే జనం పెరిగి పోయారు....

“నేను....మరే....పిల్లంగోరు...అదే ‘అయులీనం’ నేర్చుకుంటా.”ఆ కుర్రాడింకా ఆ మాట లంటున్నట్టే ఉంది....

ఇంతలో ఆ కుర్రాడి యజమాని, అతను వాడిన “వాయులీనం” అనే పదానికి అర్థం తెలియని అసామీ, ఇంకా కొందర్ని వెంట బెట్టుకుని వచ్చాడు.... గుంపుల్ని తోసుకుని పిల్లోణ్ణి చూశాడు ...గొల్లుమన్నాడు....అతనికీ ఇతనికీ ఉన్న సంబంధం తెలియని మోళీ అసామీ స్తబ్దుగా నిలబడ్డాడు...అతగాడు కుర్రాడి పెదాలకేసే చూస్తున్నాడు....పేరులేని పిల్లోడు ఎవరికేసీ చూడటం లేదు.

అవి వాయులీనం అంటున్నాయ్...

తను వాయులీనం నేర్పలేదు గనక, అతను మరెక్కడికో బయల్దేరాడు వాయులీనం నేర్చుకోవడానికి....

తను వాయులీనం నేర్చుకోవడానికి వెళ్తున్నా నన్న ఆనందం మొహంలో కొట్టొచ్చినట్టు కనిపిస్తూంది...అలలో కలిసిపోయాడు.

వాయులీనం నేర్చుకోవడంకోసం పిల్లోడు వాయువులో లీనమయ్యాడు....!! ★